క్లుప్తంగా

ఎస్సీ బాలికల హాస్టల్ తనిఖీ



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగలోని ఎస్సీ బాలకల హాస్టల్‌ను బుధవారం తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ సాయిలహరి, ఎంఈఓ రవీంద్రనాథ్ ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి, వసతుల గురించి ఆరా తీశారు. అలాగే రోజువారీ అందుతున్న ఆహార నాణ్యత మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. శుభ్రత విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయవద్దని హాస్టల్ వార్డెన్ సుభాషిణిని ఆదేశించారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సీబీఎస్ఈ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఆన్‌లైన్‌లో సీబీఎస్ఈ పరీక్షను రాశారు. బుధవారం ఈ పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాత్రమే పదో తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ ఉందన్నారు. ప్రారంభంగా ఇంగ్లిష్ పరీక్షను విద్యా ర్థులు ట్యాబ్ ద్వారా ఆన్‌లైన్ రాస్తారని తెలిపారు. ఈ పరీక్షలు 24 వ తేదీ వరకు జరుగుతాయన్నారు. సీబీఎస్ఈ సిలబస్ కావడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయు లు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్ఞానాంబకండ్రిగ చెరువు ఆక్రమణ



కబ్జాకు గురైన చెరువు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం జ్ఞానాంబకండ్రిగ చెరువు ఆక్రమణకు గురవుతోంది. జ్ఞానాంబకండ్రిగ చెరువు మదనపల్లె-నాయుడుపేట జాతీయ రహదారికి అతి సమీపంలో ఉంది. అయితే ప్రభుత్వం మారగానే ప్రస్తుత అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు కట్టతో పాటు చెరువు భూమిని చదను చేసి ప్లాట్లు వేసే ప్రయత్నం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి చెరువు భూమిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

నాగలాపురం: మండల కేంద్రంలోని టీటీడీ అనుబంధ ఆలయమైన వేదవల్లి సమేత వేదనారాయణ స్వామి కోవెలలో బుధవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన ఎస్.మల్లికార్జునరెడ్డి, కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వారికి ఆలయాధికారులు దర్శన ఏర్పాట్లు చేసి, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ షరాబు ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి తిరునాళ్ల

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో గురువారం నుంచి ఈ నెల 26వ తేదీ వర చెంగాళ పరమేశ్వరిదేవి తిరునాళ్ల జరగనుంది. స్థానిక ట్రంకు రోడ్డులోని ఆలయంలో ఈ నెల 22న చెంగాళ పరమేశ్వరి స్తంభ ప్రతిష్ఠ, గోమాత పూజ నిర్వహిస్తారు. 23న ఆలయంలో కుంభాభిషేకం, కుంభ జల సంప్రోక్షణ, సాయంత్రం అమ్మవారికి సామూహిక పొంగళ్లు, 24న అమ్మవారి గ్రామోత్సవం, 25న వసంతోత్సవం, 26న అమ్మవారికి ఊంజల్‌సేవ జరుగునుంది. గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

గణపతి హోమంలో అంజూరు

శ్రీకాళహస్తి: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గణపతి హోమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు పాల్గొన్నారు. ఆయనకు కాణిపాకం ఆలయ మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఆలయాధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎస్ఐగా విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల ఎస్ఐగా విశ్వనాథనాయుడు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటనరసింహం తిరుపతి వీఆర్ ఎస్పీ కార్యాలయానికి బదిలీ కావడంతో తిరుపతి వీఆర్ ఎస్పీ కార్యాలయంలో ఎస్ఐగా పనిచేస్తున్న విశ్వనాథనాయుడు బదిలీపై వచ్చారు.



విభిన్న రూపా.. వినాయక

గణనాథుడిని ఇన్ని రూపాల్లో చేయవచ్చని.. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడకు చెందిన కళాకారులు సత్యవేడులో విగ్రహాలను రూపొందించి, రంగులు వేస్తున్నారు. వీటిని చూసి పలువురు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఆర్డర్ల మేరకు తయారీదారులు విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు.

- ముస్తాబవుతున్న గణనాథులు
- వివిధ ఆకృతుల్లో ఆకట్టుకుంటున్న విగ్రహాలు
- ఉత్సవ నిర్వాహకుల నుంచి పెరుగుతున్న ఆర్డర్లు

సత్యవేడు: వినాయక చవితి ఉత్సవాల సమయం ఆసన్నమవుతోంది. గణనాథుడి విగ్రహాల తయారీ వేగం పెరిగింది. తమిళనాడులోని సూరావరకండ్రిగ వద్ద తయారు చేసిన వినాయక విగ్రహాలను సత్యవేడుకు తీసుకు వచ్చి, కాకినాడకు చెందిన పెయింటింగ్ కళాకారులు రంగులు అద్దుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి నవరాత్రులు ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మండపాల ఏర్పాట్లలో ఉత్సవ కమిటీలు బిజీ బిజీగా ఉన్నాయి. ఈ ఏడాది సత్యవేడులో విగ్రహాలు లభిస్తుండడంతో ఆర్డర్లు, అమ్మకాలు జోరందుకుంటున్నాయి. వచ్చే నెల 7వ తేదీన వినాయక చవితి పండుగ వస్తుండడంతో విగ్రహాలకు తుది మెరుగులు దిద్ది రంగులు అద్దే పనిలో కళాకారులు తలమునకలై ఉన్నారు. పట్టణంలో చెన్నై రోడ్డులోని పాత చాముండేశ్వరి థియేటర్ సమీపంలో ప్రత్యేక స్థావరం ఏర్పాటు చేసుకుని, విగ్రహాల తయారీ దారులు ప్రతిమలకు తుది మెరుగులు దిద్దే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఆర్డర్ల ప్రకారం విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. 5 నుంచి 12 అడుగుల వరకు విగ్రహాలను ఇక్కడ తయారు చేస్తున్నారు. వీటి ధర రూ. 7 వేల నుంచి రూ.20 వేలకు పైగా ఉంటోంది. శ్రీకాకుళం జిల్లా నుంచి ఈ సీజన్‌లో ఇక్కడకు వచ్చి కళాకారులు రంగులు అద్దుతున్నారు.

మట్టి విగ్రహాలపై ఆసక్తి



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు వినియోగించంతో వాతావరణం కలుషితం అవుతోంది. దీంతో కొన్నేళ్లుగా మట్టి వినాయక విగ్రహాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. అధికార యంత్రాంగం, ఎన్జీఓ సంస్థలు, సాక్షి మీడియా సంస్థలు మట్టి విగ్రహాలకే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. పలువురు రాజకీయ నాయకులు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేసేందుకు ప్రాధాన్యత చూపుతున్నారు.

వివిధ వాహనాల్లో వినాయకులు

నెమలి, హంస, నంది, మూసికం, సింహం, గజ, రథం, అయోధ్య, శివుడు, శ్రీకృష్ణుడు రూపాల్లో విగ్రహాలు రూపొందిస్తున్నారు. విభిన్న ఆకృతుల్లో ఉన్న వినాయక విగ్రహాలను కొనుగోలుపై ఉత్సవ కమిటీలు ఆసక్తి చూపుతున్నాయి.

ఇప్పుడిప్పుడే ఆర్డర్లు వస్తున్నాయి.



ఇప్పుడిప్పుడే ఆర్డర్లు ఇచ్చేందుకు వినాయక కమిటీల నిర్వాహకులు వచ్చిపోతున్నారు. ముడి సరుకు, రంగులు, కూలీ ధరలు గతం కంటే విపరీతంగా పెరిగిపోయాయి. కానీ విగ్రహాల ధరలు మాత్రం ఆస్థాయికి పెరగలేదు. గత ఏడాది నష్టాలు చవిచూశాం. కొన్నేళ్లుగా ఈ వ్యాపారం చేస్తున్నాం. ఈసారి లాభాలు రాకపోతే ఇబ్బందే.

-బాలాజీ, మేనేజర్ సత్యవేడు

20 ఏళ్ల అనుభవం



విగ్రహాలకు రంగులు వేయడంలో 20 ఏళ్ల అనుభవం ఉంది. నాతో పాటు 9 మంది కూలీలు పనిచేస్తున్నారు. వినాయక చవితి వచ్చిందంటే ఆగస్టు ఒకటి నుంచి సెప్టెంబర్ వరకు ఉపాధి దొరుకుతుంది. ఆ తరువాత దేవాలయాలకు రంగులు వేసేందుకు దూరప్రాంతాలకు వెళతాం. మేం రంగులు బాగా వేస్తుండడంతో వ్యాపారులు ప్రతి సంవత్సరం పిలుస్తుంటారు.

-రమేష్, కళాకారుడు, కాకినాడ

మట్టి వినాయకులే శ్రేయస్కరం



మట్టి వినాయకుడిని పూజించడం శ్రేయస్కరం. ప్రస్తుతం పోటీ పడి వినాయక మంటపాలు ఏర్పాటు చేస్తూ వివిధ ఆకృతుల్లో గణనాథుడి ప్రతిమలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే శాస్త్ర విరుద్ధమైన గణనాథుడి ప్రతిమలను పూజించడం మంచిది కాదు. పురోహితుని సలహాతో నవరాత్రి ఉత్సవాలు సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవడం అందరికీ మేలు.

-ఎం.హేమచంద్ర, శివాలయం పూజారి, సత్యవేడు

నెలాఖరులోగా సభ్యత్వాలు పునరుద్ధరించుకోవాలి

సత్యవేడు: సహకార పరపతి సంఘాల పరిధిలోని రైతులు నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకుని, తమ సభ్యత్వాను పునరద్ధరించుకోవాలని సత్యవేడు పీఏసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శరత్ కుమార్ కోరారు. రూ. 300 షేరు కలిగిన సభ్యులు ఈకేవైసీ పత్రాలు, ఆధార్ కార్డు, పాన్‌కార్డు జిరాక్స్, రెండు ఫొటోలు, ఫోన్ నంబర్, భూమి పాస్‌బుక్ లేదా 1బీ జిరాక్స్, నామినీ వివరాలు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

కూలీలందరికీ పని కల్పిస్తాం

నారాయణవనం: పేర్లు నమోదు చేసుకుని, జాబ్ కార్డులున్న కూలీలందరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పనిని కల్పిస్తామని ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏపీఓ సుకన్య పేర్కొన్నారు. వారు మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం మండలంలోని 19 పంచాయతీల్లో ప్రత్యేక అధికారులతో సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. పంచాయతీ స్థాయిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులను గుర్తించి, కూలీల సంఖ్యను పెంచడానికి గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు సమావేశానికి హాజరై చేపట్టాల్సిన పనులను గుర్తించి, నివేదికను ఆమోదించాలని వారు కోరారు.

అవనాక్షమ్మ జాతర ప్రారంభం

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో ఉన్న టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయంలో జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైనట్లు ఆలయాధికారి నాగరాజు, అర్చకులు పన్నీర్ సెల్వం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అంకురార్పణ చేపట్టామన్నారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామివారిని వివాహమాడిన సందర్భంగా పద్మావతీ అమ్మవారు అవనాక్షమ్మ ఆలయంలో గౌరీ పూజను నిర్వహించారని, వివాహానంతరం నవదంపతులైన పద్మావతీ, వేంకటేశ్వరస్వామివారు అవనాక్షమ్మను దర్శించుకున్నారని వరాహపురాణం పేర్కొంటోందన్నారు. ఆలయాధికారి నాగరాజు మాట్లాడుతూ జాతర సందర్భంగా ఆలయంలో మూలవర్లకు ఆర్జిత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 3వ తేదీన సముదాయం గ్రామంలో అమ్మవారి వీధి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. 4వ తేదీ రాత్రి సముదాయం, కీళగరం గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాల్లో చివరి రోజైన సెప్టెంబర్ 5వ తేదీ రాత్రి సముదాయం, కీళగరం, నారాయణవనం గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపు జరుగుతుందన్నారు.

యువతిని ఆదుకోండి



చికిత్స పొందుతున్న యామిని

శ్రీకాళహస్తి: అనారోగ్యంతో బాధపడుతున్న యువతిని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని దక్షిణ కైలాసనగర్ మహాత్మాగాంధీ వీధికి చెందిన ప్రేమ్‌కుమార్ గతంలో హైదరబాద్‌లోని ఓ ప్రైవేటు రోడ్డు కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టు పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. అయితే కంపెనీ చేతులెత్తేయడంతో ప్రేమ్‌కుమార్ అప్పుల పాలయ్యాడు. దీంతో గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలున్నారు. యామిని(28) ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు పీజీ చేసింది. ఈ ఏడాది మార్చి నుంచి అనారోగ్యానికి గురైంది. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స చేయించడంతో రెండు కిడ్నీలు పాడైనట్లు వాటిని మార్చాలని, ఆమెకు పెరోటోరియల్ డయాలసిస్ వైద్యం అందించాలని వైద్యులు పేర్కొన్నారు. అయితే స్విమ్స్, వేలూరు ఆస్పత్రిలో ఉన్న సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పడంతో వారు ఆర్థిక స్థోమత లేక ఇంట్లోనే ఉంటున్నారు. కిడ్నీలు మార్పిడికి రూ.లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. దాతలు 7702852684 (లలితారాణి) నంబరుకు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఆదుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



వంటశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ దయాకర్ రావు

ఏర్పేడు: విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఎంఈఓ-2 దయాకర్ రావు అన్నారు. బుధవారం ఏర్పేడు బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో వంటశాల, స్నానాలు చేసే గది, విద్యార్థులు నిద్రించే గది, మరుగుదొడ్లు, నీటి తొట్టి, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ పరిసరాల్లో మురుగునీటి నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డెన్ పల్లా వెంకటేశ్వర్లు ఉన్నారు.

మోదీని గద్దె దించితేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా



మాట్లాడుతున్న తులసీరెడ్డి

శ్రీకాళహస్తి: కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసీరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంలో కాంగ్రెస్‌ను గెలిపించడం అనివార్యమన్నారు. శ్రీకాళహస్తిలో పీసీసీ కార్యదర్శి బత్తెయ్యనాయుడుతో కలిసి తులసీరెడ్డి బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 70 రోజులు దాటిందని సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అమ్మ ఒడిని అటకెక్కించి తల్లులకు వెన్నుపోటు పొడిచారని ఎద్దేవా చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ముగిసిపోయే దశకు చేరుకున్నా ఇంకా పెట్టుబడి సాయం ఇవ్వలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు నెలకు రూ.1,500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్, ఉచిత బస్సు ప్రయాణం పథకాలు అమలు చేశారా? లేదా అన్నారు. చేసి ఉంటే తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తప్పు చేసి పప్పు కూడు తింటున్న సీఎం చంద్రబాబు రోజుకో శ్వేతపత్రాలతో సాకు పత్రాలు విడుదల చేసి రాష్ట్ర ఖజానా ఖాళీ అంటూ పలాయనవాదం ఎత్తుకోవడం సిగ్గుచేటన్నారు. నాయకులు వెంకటమురని, రమణయ్య నాయుడు, వడివేలు, చిరంజీవులు, మోహన, శివయ్య, రాఘవరెడ్డి, నాగూర్ పాల్గొన్నారు.

శ్రీసిటీకి సీఎం రాక శుభపరిణామం

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం హోదాలో చంద్రబాబు నాయుడు శ్రీసిటీలో పర్యటించడం శుభపరిణామమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం మండల పర్యటనకు వచ్చిన ఆయన వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. సీఎం పర్యటన విజయవంతం కావడంతో రానున్న రోజుల్లో మరిన్ని పెట్టుబడులు శ్రీసిటీకి వచ్చేందుకు వీలుంటుందన్నారు.

చిరంజీవికి ఘనస్వాగతం



రేణిగుంట విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న సినీనటుడు చిరంజీవి

రేణిగుంట: సినీనటుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు చిరంజీవికి బుధవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గురువారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు విమానాశ్రయంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పలువురు జనసేన నాయకులు స్వాగతం పలికారు. అభిమానులు పెద్ద సంఖ్యలో ఎయిర్‌పోర్ట్ బయట ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

వృద్ధులను ఆదుకోవాలి

ఏర్పేడు: వృద్ధులు దాతలు ఆదుకోవాలని ప్రజా సాధికారిక ట్రస్టు అధ్యక్షుడు బాలాజీ నాయక్ అన్నారు. బుధవారం జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మండలంలోని వికృతమాల లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్టులోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు అందజేత జరిగింది. ముందుగా వృద్ధులను శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగుల కోసం ట్రస్టు తరపున పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కంటికిరెప్పలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా సాధికారిక ప్రతినిధులు చంద్రశేఖర్, నారాయణరెడ్డి, సురేష్, పల్లవి, లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు సాయిదమ్మ పాల్గొన్నారు.

పార్కు ఆధునికీకరణ పనులకు మోక్షం



ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న తుడా ఉద్యానవనాధికారి మాలతి

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రంలో పదేళ్లుగా ముళ్ల పొదలతో నిండి కళావిహీనంగా, నిరుపయోగంగా ఉన్న ఉద్యానవనం అభివృద్ధి పనులకు తుడా ముందుకు వచ్చింది, దీంతో ఉద్యానవనానికి మోక్షం లభించింది. గత వారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తుడా వైస్ చైర్మన్ వెంకటనారాయణ కలసి సత్యవేడు పార్కును పరిశీలించిన సందర్భంగా తుడా నిధులతో సత్యవేడు పార్కును అధునికీకరించాలని ఎమ్మెల్యే తుడా వైస్ చైర్మన్‌ను కోరారు. ఈ నేపథ్యంలో బుధవారం తుడా ఉద్యానవన అధికారిణి కే.మాలతి, సహాయ ఉద్యానవన అధికారి బి. సుబ్రమణ్యం, ఎంపీడీఓ కే. చంద్రశేఖర్ కలసి పార్కును పరిశీలించారు. పార్కులోని ముళ్లపొదలను జేసీబీతో తొలగించే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ముని రవికుమార్, సర్పంచ్ మంజుల, రమేష్, అయ్యప్ప, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళ మట్టి తరలింపు



చెరువులోని మట్టిని ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న జేసీబీ , మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

- పట్టించుకోని అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకం పంచాయతీ పరిధిలోని తానిగిల్లు చెరువు నుంచి మంగళవారం అర్ధరాత్రి స్మగర్లు మట్టిని విచ్చలవిడిగా తరలిస్తున్నారని రైతులు వాపోతున్నారు. స్మగర్లు చెరువులోని మట్టిని తరలించి, పక్క మండలంలోని ఫ్యాక్టరీలకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో చెరువుల రూపురేఖలు మారిపోతున్నాయి. చెరువులు గుంతల మయమై పోతున్నారు. జేసీబీలతో చెరువులోని మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి మట్టి దొరక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. స్మగర్లకు ఎలాంటి అనుమతులు లేక పోవడంతో అర్ధరాత్రి వేళ మట్టిని తరలిస్తున్నారని రైతులు అంటున్నారు. మట్టి తరలింపును అడ్డుకోవటానికి ప్రయత్నించిన రైతులపై స్మగర్లు దాడులు చేస్తుండడంతో భయపడుతున్నారు. మట్టి తరలింపును అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి చెరువులలోని మట్టి తరలింపును అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.

25న రక్తదాన శిబిరం

ఏర్పేడు: స్థానిక వెంకటగిరి రోడ్డులో ఈ నెల 25వ తేదీన రక్తదాన శిబిరం జరుగుతుందని యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుయా బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించనున్నట్లు పేర్కొన్నారు. దాతలు ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు.



వరదరాజస్వామీ.. దారేది...?

ఈ దృశ్యం.. శ్రీకాళహస్తి పట్టణంలోని వరదరాజస్వామి గుడివీధిలోనిది. ఈ మార్గంలో నిత్యం వాహనాల పార్కింగ్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వీధిలో ఓ చిన్నపిల్లల ప్రైవేటు ఆస్పత్రి ఉంది. దీంతో ఈ మార్గంలో నిత్యం గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఈ ఆస్పత్రికి వస్తుంటారు అయితే అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో వారు వచ్చే ఆటోలు ఆస్పత్రి వద్దకు వెళ్లడానికి వీలులేక అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - శ్రీకాళహస్తి

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో

ఏర్పేడు: ఎస్సీ, ఎస్టీ కులాల వర్గీకరణకు నిరసనగా భారత్ బంద్‌లో భాగంగా బుధవారం ఏర్పేడులో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు ముందుగా ఏర్పేడులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్లకార్డులు ప్రదర్శించారు. ర్యాలీగా వెంకటగిరి కూడలికి చేరుకుని రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కలపాటి గురవమ్మ, శంకరయ్య, రామచంద్రయ్య, జయచంద్ర, మధు, మునికృష్ణయ్య పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నేతలు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్‌బంద్‌లో భాగంగా శ్రీకాళహస్తిలో బుధవారం బంద్ విజయవంతమైంది. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు అన్ని మూతపడ్డాయి. పట్టణంలోని అంబేడ్క ర్ విగ్రహం వద్ద జైభీమ్ ఆర్మీ, అంబేడ్కర్ మిషన్ ఆధ్వర్యంలో వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. రవికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరసన 'జ్వాల'

కోల్‌కత్తా ఆర్జీకర్ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన దారుణ ఘటనకు నిరసనగా బుధవారం రాత్రి ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కొవ్వొత్తులను వెలిగించి, ప్లకార్డులు ప్రదర్శించారు. - ఏర్పేడు

